
ఆంధ్రజ్యోతి
సిద్దిపేట 5
ఆదివారం 30 మార్చి 2025



గ్రామ పంచాయతీల
పన్ను వసూళ్లలో జిల్లా నంబర్ వన్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో రికార్డు స్థాయిలో ఇంటి పన్ను వసూలు చేసి రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం రూ.13,11,16,893 గాను రూ.12,82,35,905 పన్ను వసూలు చేసి 98 శాతం పూర్తి చేశారని పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు.



రాతి ధ్వజస్తంభాలకు కేరాఫ్ మాసాయిపేట

పదడుగుల నుంచి 45 అడుగుల ఎత్తు వరకు

రాతి విగ్రహాలు, చౌకోటలు, గురుకురాయి తయారీ

రాష్ట్రం నలుమూలల నుంచి ఆర్డర్లు

7

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు

సంగారెడ్డి మిలాద్ గ్రౌండ్‌లో భారీగా హాజరైన ముస్లిం సోదరులు



ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులకు పండ్లు తినిపిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని మిలాద్ గ్రౌండ్‌లో శనివారం సాయంత్రం ముస్లిం సోదరులకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. భారీ లైటింగ్, పరదాలు, వందల కొద్దీ టేబుళ్లు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వేలాది సంఖ్యలో ముస్లిం సోదరులను ఆహ్వానించారు. వారికి పండ్లు, డ్రైఫ్రూట్స్‌తో ఉపవాస విరమణ చేయించిన అనంతరం భోజనాలు, స్వీట్లు ఏర్పాటు చేయించారు. ఇఫ్తార్ విందులో స్వయంగా జగ్గారెడ్డి ప్రతీ టేబుల్ వద్దకు వెళ్లి పర్యవేక్షించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, కుమారుడు తూర్పు భరత్ సాయిరెడ్డి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



సంగారెడ్డి ఇఫ్తార్ విందులో జగ్గారెడ్డి, నిర్మలా రెడ్డి, భరత్ సాయిరెడ్డి

డ్రగ్స్ నివారణకు పటిష్ఠ నిఘా

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో డాటాను పరిశీలిస్తున్న సీపీ అనురాధ

రాయపోల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ మహమ్మారి నివారణ కోసం పటిష్ఠమైన నిఘా ఏర్పాటు చేశామని, గంజాయి లాంటి నిషేధ మాదక ద్రవ్యాలను సరఫరా చేసినా, వినియోగించినా చట్టప్రకారం చర్యలు తప్పవని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ హెచ్చరించారు. శనివారం ఆమె రాయపోల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లను గుర్తించి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే అక్రమ పీడీఎస్ రైస్, ఇసుక రవాణాలపై నిఘా పెంచాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ డాటా అప్‌డేట్ ఉన్నందున అధికారులను, సిబ్బందిని అభినందించారు. రాయపోల్ పోలీస్‌స్టేషన్‌కు సొంత భవనం మంజూరుకు కృషి చేస్తానన్నారు. పేర్కొన్నారు. రాయపోల్ ఉన్నత పాఠశాల సమీపంలో మూల మలుపు వద్ద, చేగుంట రహదారిపై ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖతో సమన్వయం చేసుకుని స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఎస్‌బీ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌గౌడ్, ఎస్ఐ రఘుపతి తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లను అరికట్టాలి

దౌల్తాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఆటలు, బెట్టింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెంచాలని సీపీ డాక్టర్ అనురాధ పోలీస్ అధికారులకు సూచించారు. శనివారం మధ్యాహ్నం జిల్లా సీపీ డాక్టర్ అనురాధ గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డితో కలిసి దౌల్తాబాద్ పోలీ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీ స్టేషన్‌లో రికార్డులను పెండింగ్ కేసులను, పోలీస్‌స్టేషన్ చుట్టూ పరిసరాలను పరిశీలించారు.

విశ్వావసు.. విజయోస్తు

కోయిలమ్మ కుహుకుహు రాగాలు, వసంతుని వలపు గీతాలు, మామిడాకుల మంగళనాదాలు, వేప పూల వగరు వెరసి ఉగాది... భవిష్యత్తుపై కోటి ఆశలను కలిగిస్తూ జీవన గమనంలోని ఎత్తుపల్లాలను గుర్తుచేస్తూ ఇంటిల్లిపాదికి ఇంపైన పండగ. శ్రీక్రోధినామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. గతంలోని కష్ట, నష్టాలు మళ్లీ రాకూడదని నూతన సంవత్సరం ఆరోగ్యపరంగా, ఐశ్వర్యపరంగా ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుదాం.

నూతన సంవత్సర ఉగాదికి స్వాగతం
నేడు ఆలయాల్లో పంచాగ శ్రవణం, పచ్చడి పంపిణీ

మెదక్/చేర్యాల/కొండపాక/సిద్దిపేట కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): చాంద్రమాన సంప్రదాయంలో సంవత్సరంలోని పన్నెండు నెలలలోని మొదటి రోజైన చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పర్వదినాన్ని జరుపుకుంటాం. ఆదివారం విశ్వావసు నామ ఉగాదికి స్వాగతం పలకనున్నాం. వసంత రుతువు ఆగమనంతో స్పందించి హరిత కాంతులీనుతున్న చెట్లను చూసి ప్రకృతి పరవశిస్తుంది. భవిష్యత్తు నిత్య నూతన శోభాయమానంగా ఉండాలని, శివుడి కుమారులైన కుమారస్వామి, సర్వవిఘ్న నివారకుడైన గణాధిపతికి ప్రీతిపాత్రమైన మామిడితోరణాలతో ఇంటి గుమ్మాలను అలంకరిస్తారు. ఫలితంగా సంవత్సరమంతా అవిఘ్నంగా సాగుతుందని నమ్మకం. ఉగాదిని అన్ని శుభకార్యాలకు నాందిగా భావిస్తారు. ఇంటిల్లిపాది ఇష్టదైవాన్ని పూజించి ఇంటిపెద్ద చేతులమీదుగా పచ్చడిని స్వీకరిస్తారు. భక్షభోజ్యాదులను దైవానికి నైవేద్యంగా నివేదిస్తారు. ఈ కొత్త సంవత్సరం కొంగొత్త జీవనాన్ని అందించాలనీ ఆకాంక్షిస్తూ కవులు, సాహితీవేత్తలు ఉగాది పర్వదినాన తమ కవితాఝరికి పదును పెడతారు. ఉగాది సందర్భంగా శనివారం ఉమ్మడి జిల్లాలోని మార్కెట్లు కళకళలాడాయి. కొత్త కుండలు, మామిడితోరణాలు, వేప పువ్వ కొనుగోళ్లతో సందడిగా మారింది. ఆదివారం ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణానికి, పచ్చడి పంపిణీకి ఏర్పాట్లు చేశారు. సిద్దిపేటలోని బ్రాహ్మణ పరిషత్ సంక్షేమ సదనంలో ఉగాది ఉత్సవాన్ని నిర్వహించనుండగా, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌రావు హాజరుకానున్నారు.

పచ్చడి పరమార్థం

ఉగాది మరో విశిష్టత పచ్చడి. జీవితంలో మంచి చెడులూ, కష్టసుఖాలు అంతర్భాగమనివాటిని ధైర్యంగా స్వీకరించడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఉగాది పచ్చడి అంతరార్థం. వేపపూలు, బెల్లం, ఓమ, కొత్త చింతపండు, లేత మామిడికాయలను ఉపయోగించి తయారుచేసే ఈ మిశ్రమం శాస్త్రీయంగానే కాకుండా, ఆరోగ్యపరంగా కూడా విశిష్టతను కలిగిఉంది. చేదు, తీపి, కారం, ఉప్పు, పులుపు, వగరు ఈ ఆరు రుచులు విచారం, సంతోషం, కోపం, భయం, అయిష్టత, ఆశ్చర్యం అనే ఆరు మానసిక భావనలను సూచిస్తాయి. జీవితంలో సర్వసాధారణమైన ఈ భావనలను సమభావంతో స్వీకరించాలనేదే పచ్చడి ఉద్దేశం.







దైవదర్శనం, భగవత్ నామస్మరణ చేయాలి

విశ్వావసు నామ సంవత్సరానికి అధిపతి రవి. మంత్రి చంద్రుడు. ఈ ఏడాది వృషభం, తుల, కన్య రాశుల వారికి శుభఫలితాలు గోచరిస్తున్నాయి. మిథునం, కర్కాటకం, సింహ, ధనుస్సు రాశుల వారికి మిశ్రమ ఫలితాలు వస్తాయి. అష్టమ శని, అర్ధాష్టమ శని, ఏలినాటి శని కారణంగా మీనం, కుంబం, మేష రాశుల వారికి మధ్యమ ఫలితాలు కనిపిస్తున్నాయి. సత్ సంకల్పాలు సిద్ధించడానికి దైవ దర్శనం, భగవత్ నామ స్మరణ చేయటం శ్రేయస్కరం.

- ఆచార్య సంకేత శర్మ, జ్యోతిష్య, ఆగమశాస్త్ర పండితులు

దేశంలోనే సన్నబియ్యం ఇస్తున్న
ఘనత మా ప్రభుత్వానిది

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ఇఫ్తార్ విందులో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే మొదటిసారిగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉగాది పండుగ నుంచి సన్నం బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ ఫోర్‌లైన్ రహదారికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో త్వరలో శంకుస్థాపన చేయనున్నామని వెల్లడించారు. 150 పడకల ఆసుపత్రి మంజూరు అయ్యిందని, దీనిని జిల్లెలగడ్డ ప్రాంతంలో నిర్మించే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. హుస్నాబాద్‌కు మంజూరైన ఇంజనీరింగ్ కళాశాలను పట్టణ సమీపంలోని మహాసముద్రం గండి వద్ద నిర్మించేందుకు స్థల సేకరణ చేశామన్నారు. చౌటపల్లి వద్ద పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని, మల్లెచెట్టు నుంచి ఎల్లమ్మ చెరువు వరకు సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అనంతరం పట్టణంలోని ముస్లిం మహిళలకు మంత్రి కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. హుస్నాబాద్ మున్సిపల్‌లోని పలు అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు మంజూరు చేస్తూ శనివారం రాత్రి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:35
(ఆదివారం సాయంత్రం)

నమోః నారసింహ

కనులపండువగా నాచగిరి లక్ష్మీనృసింహస్వామి విమాన రథోత్సవం

వర్గల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి నవాహ్నిక బ్రహోత్సవాలలో ప్రధాన ఘట్టమైనా విమాన రథోత్సవం శనివారం కనులపండువగా జరిగింది.



విమానరథంపై లక్ష్మీనృసింహస్వామి

బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి ఆలయం ఎదుట రథ ప్రతిష్ఠ చేసి, విమాన రథంకు ప్రత్యేక పూజలు చేశారు. శనివారం తెల్లవారుజామున తెల్లవారజామున ఆలయ ఉత్తర ద్వారం ముందు సర్వాంగా సుందరంగా అలంకరింపజేసిన విమాన రథంపై లక్ష్మీ సమేత నృసింహస్వామి వారిని గరుడ వాహనులైన దివ్య విమాన రథంపై అదిష్ఠింపజేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మేళ తాళలు, మహిళల కోలాటం, డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్యన నాచగిరి పుర వీదుల్లో స్వామివారి ఊరేగింపు కొనసాగింది. ఉదయం 6.00 గంటలకు ప్రారంభమైన రథోత్సవం 9.00 గంటల వరకు సాగింది. రథోత్సవం అనంతరం వేద పండితులు మహా పూర్ణహుతి, చక్రవరి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకలకు పరిసర ప్రాంతాల భక్తులతో పాటు హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాలు, ఇతర జిల్లాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కూచారం నర్సింలుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అశేష భక్తజనం మధ్యన విమాన రథత్సోవం

ఇక రైట్ రైట్

- హామీ నిలబెట్టుకున్న కలెక్టర్
- గురువన్నపేట పాఠశాలకు బస్సు



పాఠశాలకు సమకూర్చిన బస్సు

చేర్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ చొరవతో కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట జడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కాలినడక కష్టాలు తీరనున్నాయి. 200మందికి పైబడి విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. అయితే సమయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల 15న కలెక్టర్ మనుచౌదరి ఈ పాఠశాలకు విచ్చేయగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ బస్సు సౌకర్యం కల్పిస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే కలెక్టర్ తన నిధులు నుంచి రూ.16లక్షల వ్యయంతో బస్సును కొనుగోలు చేశారు. రవాణా శాఖ అధికారులు బస్సు రిజిస్ట్రేషన్ పత్రాలను శనివారం పాఠశాల ఉపాధ్యాయులకు అప్పగించారు. హామీని నెరవేర్చడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వెలిబుచ్చుతున్నారు.

'యువ వికాసం'కు అడ్డంకులు

- దరఖాస్తుకు ఆదాయ, కుల ధ్రువపత్రాలు తప్పనిసరి
- మీ సేవా కేంద్రాల వద్ద బారులు
- యువతకు తప్పని నిరీక్షణ
- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలం
- మండిపడుతున్న నిరుద్యోగులు

సిద్దిపేట టౌన్, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రుణాలను అందించి వారి అభివృద్ధికి బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసానికి ఆది నుంచి అడ్డంకులే ఏర్పడుతున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలంటే ఈ ఏడాది తహసీల్దార్ కార్యాలయం నుంచి జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ తప్పనిసరి. దీంతో జిల్లావ్యాప్తంగా యువత మీసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అక్కడ దరఖాస్తు ప్రక్రియ త్వరగానే పూర్తవుతున్నప్పటికీ, తహసీల్దార్ కార్యాలయాల్లో పరిశీలించి ధ్రువపత్రాలను జారీ చేయడంలో ఆలస్యమవుతున్నది.

మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

ఈ నెల 17 నుంచి ఆన్‌లైన్‌లో రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు ప్రారంభమైనప్పటికీ, తొలుత పథకానికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం వెల్లడించలేదు. దరఖాస్తుదారుల నుంచి నిరసనలు ఎదురుకావడంతో, ఇటీవల రాయితీలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. రూ.50వేల నుంచి మొదలుకుని ఆయా యూనిట్ల కోసం రాయితీలను ప్రకటించింది. యూనిట్ల వారీగా రూ.50 వేలు రుణం తీసుకుంటే వంద శాతం, లక్షలోపు 90శాతం, రూ.2లక్షల్లోపు 80శాతం, రూ.2లక్షలపైన ఉంటే 70 శాతం రాయితీని కల్పిస్తున్నది. దరఖాస్తు చేసుకునేందుకు 21 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు, వ్యవసాయరంగానికి సంబంధించిన యూనిట్ కోసం రైతులకు 60 ఏళ్ల వరకు అర్హులుగా ప్రభుత్వం వెల్లడించింది.

మీ సేవా కేంద్రాల వద్ద నిరీక్షణ

జిల్లాలోని మీ సేవా కేంద్రాల వద్ద దరఖాస్తుదారులతో సందడిగా మారింది. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5న తుది గడువు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువు దగ్గర పడుతుండటం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు ఆలస్యమవుతుండటంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. సర్వర్ డౌన్ అవ్వడంతో ధ్రువపత్రాలు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదు. దరఖాస్తులు ఎక్కువగా వస్తుండగా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని దరఖాస్తుదారులు మండిపడుతున్నారు. పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మరింత గడువు పెంచాలని యువత కోరుతున్నది.



సిద్దిపేటలోని ఓ మీసేవా కేంద్రం వద్ద సందడి

దరఖాస్తు చేసుకోండి : కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, ఈఈ విజయ భార్గవ్‌తో కలిసి ఆవిష్కరించారు.

'గురుకుల' విద్యార్థి మృతి

● సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ ప్రజా, దళిత సంఘాల ఆందోళన


నిఖిల్ (ఫైల్)

కల్హేర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండల పరిధి చీలపల్లికి చెందిన ధారా సుధాకర్, మంజుల కుమారుడు ధారా నిఖిల్ సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ పరిధి నల్లవాగు(సుల్తానాబాద్)లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నిఖిల్ కొద్దిరోజులుగా తీవ్ర అస్వస్థతకు గురైనట్లు పాఠశాల సిబ్బంది ఈ నెల 26న తండ్రి సుధాకర్‌కు ఫోన్ చేసి చెప్పారు. ఆయన ప్రమాదం జరిగి కాలు విరిగి ఉండటంతో తన బావమరిదిని పాఠశాలలకు పంపించారు. నిఖిల్‌ను నారాయణఖేడ్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పతితో చూపించగా, వారు హైదరాబాద్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడి ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం సాయంత్రం నిఖిల్ చనిపోయాడు. పసిరికలతోపాటు ఊపిరితిత్తులు దెబ్బతినడంతో పరిస్థితి విషమించి చనిపోయినట్లు వైద్యులు చెప్పారు. అయితే, విద్యార్థి అస్వస్థతకు గురైనా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పట్టించుకోలేదని, సకాలంలో వైద్యం అందించకపోవడంతో పరిస్థితి విషమించి నిఖిల్ చపోయాడని విద్యార్థి బంధువులు, ప్రజా, దళిత సంఘాల నాయకులు ఆందోళన చేస్తూ నల్లవాగు సమీపంలోని గోసాయిపల్లి శివారుకు వచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న నారాయణఖేడ్, కంగ్టి పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి విద్యార్థి మృతదేహంతో ఆందోళనకు దిగారు. నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారికి మద్దతు తెలిపారు. గురుకుల పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ నిర్మలతో మాజీ ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి విద్యార్థి కుటుంబానికి రూ. పది లక్షలు, వారి ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తిని సంఘటన స్థలానికి పంపి విద్యార్థి కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, అంత్యక్రియలకు రూ. 50వేలు అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి శనివారం సాయంత్రం పాఠశాలను సందర్శించి విద్యార్థి మృతికి గల కారణాలపై ఆరా తీశారు. మరోవైపు నిఖిల్ మృతి ప్రభుత్వ హత్యేనని, కుటుంబానికి రూ.50 లక్షల ఆర్థికసహాయం ఇవ్వాలని ఏబీవీపీ నగర కార్యదర్శి శంకర్ అన్నారు. ప్రభుత్వం ఈ విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అశోక్ అన్నారు.

అడవిలో చెలరేగిన మంటలు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రామాయంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట అడవిలో అగ్ని ప్రమాదం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తి అడవిలో అగ్గిపుల్ల వేయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే పది ఎకరాల్లో మంటలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది అప్రమత్తతతో భారీ ప్రమాదానికి అడ్డు కట్టపడింది, లేదంటే దట్టంగా ఉన్న అడవిలోకి మంటలు పాకి భారీ నష్టం సంభవించేది.

ఇద్దరికి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

చిన్నశంకరంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు దొంగలను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. శనివారం తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివంపేట మండలానికి చెందిన కళమ్మ వారం క్రితం సంగాయిపల్లిలో మల్లన్న జాతర సందర్భంగా బంధువుల ఇంటికి వెళ్లేందుకు గవ్వలపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ఆటో కోసం వేచి చూస్తుంది. అదే సమయంలో ఎస్ కొండాపూర్ గ్రామానికి చెందిన మాడబోయిన బాబు, మాడబోయిన గురుచరణ్ బైక్‌పై వచ్చి కళమ్మను ఎక్కడికి వెళ్తున్నావని పలుకరించి మాటకలిపారు. మేము కూడా అక్కడికే వెళ్తున్నామని ఆమెను బైక్‌పై ఎక్కించుకుని మార్గమధ్యలోని ఓ కోళ్లఫారం వద్దకు తీసుకెళ్లి కళ్లలో కారంపొడి చల్లి మెడలోని బంగారు నగలను అపహరించారు. బాధితురాలు చిన్నశంకరంపేట పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. శనివారం దుండగులను పట్టుకొని వారి నుంచి రూ.1.50లక్షల విఫుగల బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ నారాయణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ట్రాక్టర్ ఢీకొని ఇద్దరి దుర్మరణం

చిలప్‌చెడ్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీ కొనడంతో ఇద్దరు దుర్మరణం చెందిన సంఘటన శనివారం మండలం పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని భద్రియ తాండాకు చెందిన సభావత్ అంసిబాయి (35) శుక్రవారం ఉదయం కూరగాయలు అమ్మడానికి జోగిపేట పట్టణానికి వెళ్లింది. అనంతరం రాత్రి 7.30 ప్రాంతంలో ఇంటికి బయలు దేరింది. మార్గమధ్యలో సంగారెడ్డి జిల్లా అందోలు మండలం కిచ్చన్నపల్లి గ్రామానికి చెందిన నరాల మల్లయ్య (58) జోగిపేట నుంచి చిట్కుల్ వైపు టీవీఎస్‌ఎక్స్ఎల్‌పై వస్తుం వస్తుండగా అంసిబాయి లిఫ్ట్ అడిగి బండి ఎక్కింది. ఇద్దరు చాముండేశ్వరి ఆలయ సమీపంలోని భారత్ పెట్రోల్ బంకు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఎక్స్ఎల్‌ను ఢీకొనడంతో బండిపై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మల్లయ్య మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అంసిబాయిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి భర్త సభావత్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెత్త తొలగించేందుకు వెళ్లి..
విద్యుదాఘాతంతో మృతి

రామాయంపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) :విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం రామయంపేట మండల పరిధి కోనాపూర్ హనుమాన్ ఆలయంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోనాపూర్ గ్రామానికి చెందిన మాధవరెడ్డి(70) ప్రతీ రోజు వేకువ జామున ఆలయ ఆవరణలోని చెత్త చెదారాన్ని తొలగిస్తాడు. శనివారం కూడా చెత్తను ఊడ్చుతున్న క్రమంలో మాధవరెడ్డి ప్రమాదవశాత్తు ఎర్తింగ్ వైర్‌ను పట్టుకున్నాడు. అప్పటికే పోల్ పై తెగిన వైరు దానికి తాకి ఉండడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామయంపేట మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పొదలను తొలగిస్తూ..

జహీరాబాద్, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మొగుడంపల్లి మండలంలోని గోపన్‌పల్లి గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి (53) పట్టణంలోని ఓ ఫాం హౌజ్‌లో మూడేళ్లుగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం మధ్యాహ్నం పొలంలో పొదలను తొలగిస్తున్న క్రమంలో అప్పటికే తెగిపడిన విద్యుత్ వైరును గమనించక పట్టుకున్నాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో సజీవ దహనమయ్యాడు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చిరాగ్‌పల్లి పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య గీత, మనుమరాలు దీక్ష ఉన్నారు.

వాటర్ హీటర్ పెడుతూ..


నర్సింహులు (ఫైల్)

మాసాయిపేట, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మాసాయిపేటలోని శ్రీనివాసనగర్ కాలనీలో విద్యుత్ షాక్‌తో ఓ యువకుడు మృతి చెందాడు. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేట గ్రామానికి చెందిన గోరగళ్ల నర్సింహులు(35) శనివారం మధ్యాహ్నం తన ఇంటిలో స్నానం చేయడానికి గాను హీటర్ పెడుతూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బోర్లపడి వ్యక్తి..

వర్గల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : పొలం వద్ద బోర్లపడి వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన శనివారం వర్గల్ మండలం అంబర్‌పేటలో చోటు చేసుకుంది. గౌరరం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు అంబర్‌పేట గ్రామానికి చెందిన మన్నె నర్సింహులు(46) శనివారం ఉదయం 5.00 గంటలకు పొలం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య లక్ష్మి పొలం వద్దకు వెళ్లి చూడగా నర్సింహులు పొలం వద్ద బోర్లపడి మృతిచెంది కనిపించాడు. పొలం గట్టుపై నడుస్తుండగా కాలు జారి బోర్లపడటంతో శ్వాస అందక మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి కుమారుడు వర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

పటాన్‌చెరు రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన శనివారం కర్దనూర్ ఓఆర్ఆర్ వద్ద శనివారం చోటుచేసుకుంది. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ కథనం ప్రకారం కర్దనూర్ రింగ్ రోడ్డు వద్ద 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల మహిళ మృతదేహం ఉందని సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నీలి రంగు బ్లౌస్ , పసుపు రంగు అంచుతో కూడిన నీలి రంగు చీర ధరించి ఉందని తెలిపారు. ఆమె ఎడమ కాలుకి నల్ల దారం, కుడి చేతిపై నరేందర్ అని తెలుగులో , సాయి సాత్విక్ అని ఇంగ్లిష్‌లో పచ్చ బొట్టు ఉందని తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 8712656727 నంబర్‌ను సంప్రదించాలని సీఐ తెలిపారు. ఈ మేరకు బీడీఎల్ పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


అశోక్(ఫైల్)

కల్హేర్, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గ్రామానికి చెందిన పల్వట్ల అశోక్, సుజాత దంపతులకు తరుచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఇటీవల భార్య సిర్గాపూర్ మండలం పరిధి కడ్పల్‌లోని పుట్టినింటికి వెళ్లింది. తాగుడుకు బానిసైన అశోక్ భార్య కాపురానికి రావడం లేదన్న కారణంతో శుక్రవారం రాత్రి తన ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సుజాత పిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గంజాయి రవాణా కేసులో పదేళ్ల జైలు

పటాన్‌చెరు, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో నిందితులకు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ సంగారెడ్డి అడిషనల్ కోర్టు న్యాయమూర్తి శనివారం తీర్పు చెప్పారని పటాన్‌చెరు ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ తెలిపారు. మే 4, 2019లో ఒరిస్సా బార్డర్ నుంచి జహీరాబాద్‌కు రెండు కార్లలో 508 కిలోల గంజాయిని తరలిస్తుండగా పటాన్‌చెరు శివారులో మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్న జహీరాబాద్‌కు చెందిన బన్నూర్ వీర్‌శెట్టి, ఝరాసంఘంకు చెందిన జాదవ్ భన్సీలాల్, బీదర్‌కు చెందిన పుట్‌రాజ్‌సీతారం అనే ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితల నుంచి గంజాయితో పాటు ఇన్నోవా, జైలో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. న్యాయస్థానంలో కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా, పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన అంబులెన్స్

కొండాపూర్, మార్చి29 (ఆంధ్రజ్యోతి) : అంబులెన్స్ ట్రాక్టర్ ఢీకొట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం నాగుసాన్‌పల్లికి చెందిన పులుమద్ది మల్లమ్మ అనారోగ్యానికి గురైంది. ఆమెను భర్త నర్సయ్య, కొడుకు, కోడలు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుత్రికి అంబులెన్స్‌లో తరలిస్తున్నారు. మల్కాపూర్ చౌరస్తా పరిధిలోని అండర్ పాస్ బ్రిడ్జి వెంకటేశ్వర ఫంక్షన్‌హాల్ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను అంబులెన్స్ ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. దీంతో అంబులెన్స్ డ్రైవర్ వాహనంలో ఇరుక్కుపోయి తీవ్ర గాయాలపాలుకాగా, మిగతా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్‌లో గజ్వేల్‌కు చెందిన ఇద్దరికి చోటు

గజ్వేల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్‌లో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిని ఇద్దరు న్యాయవాదులకు చోటు దక్కింది. గజ్వేల్ పట్టణానికి చెందిన ఖాజా విజారత్‌అలీ, తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు కాలేరు విఠల్ కుమారుడు కాలేరు నరేశ్ చోటు దక్కించుకున్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శిగా విజారత్‌అలీ ఎన్నిక కాగా, బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కాలేరు నరేశ్ ఎన్నికయ్యారు. వీరి నియామకం పట్ల గజ్వేల్ పట్టణ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

చేర్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలోని గురుకుల పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. పాఠశాలలో ల్యాబ్, డైనింగ్‌హాల్‌లో మరమ్మతుల నిమిత్తం ట్రాక్టర్‌లో ఇటుకలోడు తీసుకువచ్చిన డ్రైవర్ పక్కకు వెళ్లిపోయాడు. ఆరుబయట విద్యార్థులు ఆడుకుంటున్న క్రమంలో ఓ విద్యార్థి ట్రాక్టర్ ఎక్కి స్టీరింగ్‌తో ఆడుకుంటుండటాన్ని గమనించిన వైస్ ప్రిన్సిపాల్ రాజారావు చిదకబాదారు. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో గుట్టుచప్పుడు కాకుండా చికిత్స చేయించి బయటకు పొక్కకుండా ప్రయత్నించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ నర్సింహచారిని వివరణ కోరగా ఉగాది పండుగ సందర్భంగా తాను సెలవు పెట్టానని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానన్నారు.

సండే స్పెషల్
Sunday Special

రాతి ధ్వజ స్తంభాలకు కేరాఫ్ మాసాయిపేట

- 10 నుంచి 45 అడుగుల ఎత్తు వరకు
- రాత్రి విగ్రహాలు, చౌకోట్లు, గరుకు రాయి తయారీ
- వివిధ ప్రాంతాల నుంచి ఆర్డర్లు

తూప్రాన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆలయాల నిర్మాణం మహా యజ్ఞం లాంటింది. ఆలయం నిర్మించడం ఒకెత్తైతే విగ్రహాలు, ధ్వజ స్తంభాలు, గరుకురాయి, ఆలయ దర్వాజ చౌకోట్లు తయారు చేయించి ఆలయంలో ప్రతిష్ఠింపజేయడం మరో ఎత్తు. ఇంతటి ప్రాధాన్యమున్న ధ్వజ స్తంభాలు, చౌకోట్లు, గోశాలలకు గరుకురాయి తయారీకి మెదక్ జిల్లా పరిధిలోని మండల కేంద్రమైన మాసాయిపేట కేరాఫ్‌గా నిలుస్తున్నది. మాసాయిపేటలోని 44వ జాతీయ రహదారిపై పక్కనే వడ్డెర కులస్థుల కుటుంబాలు కొన్నేళ్లుగా బండరాయిని కొడుతూ జీవనం సాగిస్తున్నాయి. అందులో సుమారు 10 మంది ప్రత్యేకంగా ఆలయాలకు సంబంధించిన పనులు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. వివిధ జిల్లాలకు చెందిన భక్తులు, ఆలయ నిర్మాణదాతల ఆర్డర్లపై రాతి ధ్వజ స్తంభాలు, రాతి చౌకోట్లు, గురుకు రాయి తయారు చేస్తున్నారు. వివిధ రకాల చిత్రాలు, డిజైన్లతో కూడిన రాతి ధ్వజ స్తంభాల తయారీకి సుమారు మూడు నెలల కాలం పడుతుందని వారు తెలిపారు.

ఎత్తును బట్టి ధర..

ఆలయం ఎత్తును బట్టి రాతి ధ్వజ స్తంభాలు తయారు చేయిస్తుంటారు. ఆర్డర్లకు అనుగుణంగా 10 అడుగుల నుంచి 45 అడుగుల ఎత్తు వరకు తయారు చేస్తున్నారు. ఆలయాల దర్వాజలకు రాతి చౌకోట్లు, గోశాల, పశువుల కోసం గరుకు రాయి సైతం తయారు చేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ సమీపంలోని ఓ ఆలయానికి 36 అడుగుల రాతి ధ్వజ స్తంభాన్ని తీర్చిదిద్దుతున్నారు. స్తంభాల ఎత్తును బట్టి రూ. లక్ష నుంచి రూ.4 లక్షల వరకు తీసుకుంటున్నట్లు తయారీదారులు తెలిపారు. ఆర్డర్ చేసిన అభిష్టం మేరకు స్తంభంపై పూలు, ఓంకారం, నాగ సర్పాల తదితర చిత్రాలను చెక్కుతున్నారు.


తయారు చేస్తున్న 36 అడుగుల భారీ ధ్వజ స్తంభం

రాతి విగ్రహాలూ చేస్తాం



ధ్వజ స్తంభాలు, గరుకు రాయి, ఆలయ చౌకోట్లతోపాటు రాతి విగ్రహాలు తయారు చేస్తాం. సుమరుగా 3 నెలల సమయం పడుతుంది. కానీ అత్యవసరమైతే త్వరగా కూడా అందజేస్తున్నాం. మాసాయిపేటలో మెరుగైన రాయి లభిస్తుండడంతో వివిధ ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తున్నాయి.

- పల్లపు సురేష్, మాసాయిపేట

10 మందిమి తయారు చేస్తున్నాం



మాసాయిపేటలో 10 మందిమి రాతి ధ్వజ స్తంభాలను తయారు చేస్తున్నాం. గతంలో సుత్తి, సొనంతో పనులు చేసే వాళ్లం. ప్రస్తుతం యంత్ర పరికరాలతో పనులు చేసున్నాం. శ్రమకు తగ్గ ఫలితం దొరుకుతుంది.

- శ్రీనివాస్, మాసాయిపేట



రాతి ధ్వజ స్తంభాలపై చిత్రాలు


తెలంగాణ సబ్ ఏరియా కమాండింగ్ మేనేజర్ అజయ్ మిశ్రాతో ఒప్పందం చేసుకుంటున్న ఏవీఎన్‌ఎల్ జీఎం విజయ కే దత్

సాయుధ దళాలకు వైద్య సదుపాయాలు.. ఏవీఎన్‌ఎల్ సహకారం

- రూ.32 లక్షల వైద్య పరికరాలు ఇచ్చేందుకు ఒప్పందం

కంది, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యతతలో భాగంగా సాయుధ దళాలకు వైద్యసదుపాయాలు అందించేందుకు సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఎద్దుమైలారం వద్దనున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఏవీఎన్ఎల్ (ఆర్మ్‌డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్) సహకారం అందించనుంది. ఇందులో భాగంగా రూ.32 లక్షల వైద్య పరికరాలు ఇచ్చేందుకు హైదరాబాద్‌లో శనివారం ఆర్మీ అధికారులతో ఏవీఎన్ఎల్ అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. తెలంగాణ సబ్ ఏరియా కమాండింగ్ మేనేజర్ అజయ్ మిశ్రా, ఏవీఎన్ఎల్ జీఎం విజయ కే దత్‌లు ఎంఓయూలపై సంతకాలు చేశారు. మాజీ సైనికుల కాంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీమ్ పాలిక్లినిక్‌లకు, అనుభవజ్ఞులు వారి కుటుంబాలకు ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరిచే లక్ష్యంతో రూ.32 లక్షల విలువైన వైద్య పరికరాల సేకరణ, సరఫరాను ఈ ఒప్పందం సులభతరం చేస్తుందని అజయ్ మిశ్రా పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ మోహన్, డాక్టర్ మూర్తి, బాలకిషన్, సౌమ్య, శర్మ, ప్రణవి, శ్రీ రామ్ ప్రసాద్. ఆర్మీ నుంచి కల్నల్ వికాస్ సింగ్, డైరెక్టర్ కల్నల్ సుమిత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల పన్ను వసూలైంది..


బిల్‌కలెక్టర్‌లతో సమీక్ష నిర్వహించిన కమిషనర్

ఐడీఏబొల్లారం మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆస్తిపన్నులో 90శాతం వడ్డీ రాయితీ పథకం పరిశ్రమల యజమానులను ఆకర్షించింది. మూతపడిన పరిశ్రమల వారు చెల్లింపులు జరపడానికి ముందుకు వచ్చారు. ఐడీఏబొల్లారం పురపాలక పట్టణం పారిశ్రామికవాడతో మిళితం అయి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా పన్నుల వసూలు విషయంలో గృహాలతో సమాంతరంగా పరిగణలోకి తీసుకుంటున్నారు. అలా రూ.13.5 కోట్లు ఏటా వసూలు కావాల్సి ఉంది. ఇందులో పరిశ్రమల నుంచి రూ.8.21కోట్లు వస్తున్నాయి. పట్టణ ప్రజలు రూ.4.86కోట్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్నారు. ఏటా రాబడి విషయంలో పరిశ్రమల వారు ఆదుకుంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన 90శాతం వడ్డీ రాయితీ పథకం రాబడి పెంచుకోవడానికి అవకాశం ఏర్పడింది. మూతపడిన పరిశ్రమల యజమానులు చెల్లింపులు జరపడానికి ముందుకు వచ్చారు. ఒక పరిశ్రమ రూ.46లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.15.5లక్షలు రాయితీ రూపంలో లబ్ధి పొందారు. చివరి రోజు శనివారం రూ.35లక్షలు వసూలు చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మధుసూదన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 86శాతం వరకు పన్నుల రూపంలో వసూలు చేయగలిగామని తెలిపారు. వాస్తవానికి ఈనెల 31 వరకు చెల్లింపులు జరపడానికి అవకాశం ఉన్నా ఉగాది, రంజాన్‌లకు సంబంధించిన సెలవులు వరుస సెలవులు వచ్చాయి. బకాయిలతో కలిపి రూ.16.3కోట్లు వసూలు కావాల్సి ఉండగా ఇప్పటికే రూ.14కోట్లు వసూలు అయ్యాయి.

మనవతా జ్ఞాన శాస్త్రాలను అందించేందుకు ఐఐటీహెచ్ సహకారం

- పబ్లిక్ హ్యుమానిటీస్ పరిశోధనలకు శ్రీకారం


ఐఐటీహెచ్‌లో పబ్లిక్ హ్యుమానిటీస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికతతో మనవతా జ్ఞాన శాస్త్రాలను అందించేందుకు ఐఐటీహెచ్ పబ్లిక్ హ్యుమానిటీస్ పరిశోధనలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఐఐటీహెచ్‌లో లిబరల్ ఆర్ట్స్ విభాగానికి చెందిన డా. షుహిత భట్టాచార్జీ నాయకత్వంలో ఈ నెల 24 నుంచి 29 వరకు లింగ రాజకీయాల సిద్ధాంతాలు వాటి ఆచరణల గురించి చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఐఐటీహెచ్ డిజైన్ అండ్ లిబరల్ ఆర్ట్స్ విద్యార్థులచే ఇంటరాక్టివ్ ఆర్ట్‌డిస్‌ప్లేలు, లైఫ్-సైజ్ ఇన్‌స్టాలేషన్‌లు కౌమారదశకు సంబంధించిన అత్యవసర అవసరాన్ని పరిష్కరించే సామాజిక రంగ పరిశోధనపై ఆధారపడిన విభాగాలపై విద్యార్థులు చర్చించారు. మానవ అవసరాల కోసం సాంకేతిక విద్య, సైన్స్ అండ్ టెక్నాలజీతో మానవీయ శాస్త్రాలను సృజనాత్మక పరిశోధనలు కోసం కళాకారులు విధాన నిర్ణేతలు, సాహిత్యాన్ని సంభాషణలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎలి పనిచేయనున్నారు శోధించనున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు తెలిపారు. వినూత్న విద్యా అభ్యాసాల ద్వారా సామాజిక సమస్యలను పరిష్కరించేటప్పుడు మానవీయ శాస్త్రాలు మరియు సామాజిక శాస్త్రాల మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

తప్పుడు కేసులతో బీజేపీ కార్యకర్తలను రిమాండ్ చేయడం అన్యాయం

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

కంది, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సేవ చేసుకునే బీజేపీ కార్యకర్తలను తప్పుడు కేసులతో రిమాండ్ చేయడం అన్యాయమని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదు చేసి రిమాండ్ చేసిన నేపథ్యంలో ఆయన శనివారం కంది జైలులో వారితో ములాఖాత్ అయ్యారు. అందరికీ త్వరలోనే బెయిల్ వస్తుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన జైలు బయట మీడియాతో మాట్లాడుతూ కక్ష పూరితంగా హత్నూర ఎస్సై బీజేపీ కార్యకర్తలను రిమాండ్ కు పంపించారని మండిపడ్డారు. గతంలో రెడ్డిఖానపూర్ గ్రామంలో ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి వచ్చిన గణనీయమైన ఓట్లు చూసి కొందరు రాజకీయ నాయకులు ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. బీజేపీకి పెరుగుతున్న మద్దతు దృష్ట్యా జీర్ణించుకోలేక సేవలు చేసుకునే అమయక కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టారని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దస్ మల్లేష్ గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, బీజేపీ హత్నూర మండల అధ్యక్షులు నాగప్రభు గౌడ్, బీజేపీ నర్సాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ ఎర్ర సతీష్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రాజమల్ల రెడ్డి, మండల నాయకులు ప్రభాకర్, రాజు, శ్రీశైలం, మల్లేష్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు

ఐదు వేల కోళ్లు మృతి

- నెల రోజుల్లో తీగుల్ గ్రామంలో 20వేలకుపైగా..



జగదేవ్‌పూర్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఎండ ప్రభావమో లేదా బర్డ్‌ఫ్లూ వల్లనో తెలియదు కానీ పౌల్ట్రీ కోళ్లు పది రోజులుగా కుప్పలు కుప్పలుగా మృత్యువాత పడుతున్నాయి. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలో తీగుల్ గ్రామానికి చెందిన గంధ్ర నరేందర్ పౌల్ట్రీ పరిశ్రమతో కొన్నేళ్లుగా ఉపాధి పొందుతున్నారు. తనకున్న ఆరువేల పౌల్ట్రీ ఫాంలో కోళ్లు పెంచుతూ వస్తున్నారు. కోళ్లు ప్రస్తుతం రెండు కిలోల వరకు ఎదిగాయి. పది రోజులుగా వందలకొద్ది కోళ్లు మృత్యువాత పడడం వల్ల పౌల్ట్రీ రైతు నరేందర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన కోళ్లను తమ పొలంలోనే గుంత తీసి పాతి పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఐదు వేల వరకు మృతి చెందాయని తమ గోడును వెల్లిబుచ్చారు. సుమారు లక్షకు పైగా నష్టం జరిగిందని తెలిపారు. గత నెల రోజులుగా తిగుల్ గ్రామంలో ఆయా పౌల్ట్రీఫాంలో ఇప్పటి వరకు సుమారు 20వేల వరకు కోళ్లు చనిపోయాయి. తమతో పాటు నష్టం జరిగిన పౌల్ట్రీ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర
- సంగారెడ్డి సెంట్రల్ జైలులో ఆకస్మికంగా జిల్లా జడ్జీ తనిఖీ

కంది, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ జైలులో ఉన్న ఖైదీలకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల ప్రకారం ఆమె కందిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలును శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆమె సెంట్రల్ జైలులోని బ్యారక్‌లు, గదులు, వంట గది, బాత్రూంలు, జైలు ఆవరణ మొత్తం తిరిగి పరిశీలించారు. వంటశాలలో పరిశుభ్రతపై ఆరాతీసి ఖైదీలకు పెడుతున్న భోజనాన్ని ఆమె రుచి చూశారు. కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలిపారు. ఆమె వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, జైలు సూపరింటెండెంట్ సంతోష్ కుమార్ రాయ్, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కందిల: ఖైదీలకు అందిస్తున్న భోజనాన్ని రుచి చూస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

సంగారెడ్డి క్రైం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : మత పరమైన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీచంద్ర అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో శనివారం కమ్యూనిటీ వర్గాల వారితో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మా ఇల్లు సేవా సంస్థ చైర్మన్ తోపాజి అనంతకిషన్, యువజన సంఘాల సమితి అధ్యక్షుడు డాక్టర్ కూన వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు తాహేర్, యాదగిరి, ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు ఫాజిల్ ఇర్ఫాన్, కార్యదర్శి యాకూబ్ అలీ, ఫోరం ఫర్ బెటర్ అధ్యక్షుడు శ్రీదర్ మహేంద్ర, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు అశోక్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'విజయ' ఉత్పత్తులు అందుబాటులో ఉంచాలి

- విజయ డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డి


డెయిరీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న అమిత్‌రెడ్డి, కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, మార్చి 29(ఆంధ్రజ్యోతి) : విజయ డెయిరీ ఉత్పత్తులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని ప్రధాన కూడళ్లలో విజయడైరీ పార్లర్లను ఏర్పాటు చేయాలని విజయ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అమిత్‌రెడ్డి సూచించారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులోని మహిళా సమైఖ్య భవనం, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ వారి విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డైరీ పార్లర్లను శనివారం కలెక్టర్ వల్లూరు క్రాంతితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్‌రెడ్డి, కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా విజయ డెయిరీ పార్లర్లను ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ సింగ్, జీఎం మధుసూదన్‌రావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుధామాధురి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్, మెడికోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకం పెంచేందుకు కృషి

నారాయణఖేడ్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): గేదే పాల ప్రోత్సాహకం పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి ఖేడ్ పాలశీథలీకరణ కేంద్రాన్ని సందర్శించారు. అందులోని యంత్రాలను పరిశీలించారు. అనంతరం పాడి రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, పశుపోషకుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మిల్క్ సెంటర్ మేనేజర్ డేవిడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజిరెడ్డి, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్‌చౌహాన్, పాల ఉత్పత్తిదారుల అధ్యక్షులు నాగం జీవన్, మశ్చందర్ పాల్గొన్నారు.


జహీరాబాద్ పట్టణంలోని సిద్దేశ్వరాలయంలో శనీశ్వరుని దర్శనం కోసం బారులు


కొండాపూర్ : శనీశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎస్పీ పరితోష్ పంకజ్ దంపతులు


నారాయణఖేడ్ : శనీశ్వరుడి విగ్రహానికి తైలాభిషేకం చేస్తున్న భక్తులు

శనీశ్వరుడికి తైలాభిషేకాలు

- శని అమావాస్య సందర్భంగా పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు

న్యూస్ నెట్‌వర్క్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : శని అమావాస్య సందర్భంగా శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనీవ్వరుడి స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామ శివారులోని శని శక్తిధామంలో శనీశ్వరునికి భక్తులు తైలాభిషేకాలు చేశారు. కొండాపూర్‌తోపాటు జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. పట్టణంలో సిద్దేశ్వరాలయంలో గల శనీశ్వరున్ని దర్శించుకున్నారు. నారాయణఖేడ్ మండలం పంచగామలోని శనీశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. మనూరు మండలం బాదల్‌గాంలోని పంచలింగేశ్వర ఆలయంలో కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారి శివ్‌లింగ్ మహరాజ్ పూజలు చేశారు.


నారాయణఖేడ్ : శనీశ్వర ఆలయ ఆవరణలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


మనూరు : పంచలింగేశ్వర ఆలయంలో కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారి శివలింగ్ మహరాజ్

రూ.4 లక్షలకు పైనే తైబజారు వేలం

దౌల్తాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో తైబజారు వేలాన్ని శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో సయ్యద్‌గఫూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దౌల్తాబాద్‌కు చెందిన బోరింగ్ శ్రీనివాస్ రూ.4 లక్షల 1వేయి 6వందలకు వేలం పాడి దక్కించుకున్నారు.

ఉగాది పురస్కారానికి అర్చకుడు

చేర్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యాడు. ప్రభుత్వం యేటా ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్న నేపథ్యంలో చాన్నాళ్ల తరువాత మల్లన్న ఆలయ అర్చకుడికి ప్రాధాన్యం కల్పించారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రభుత్వం తరుపున నిర్వహించనున్న ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు.

హుస్నాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహం

హుస్నాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని నాగారం రోడ్డు చౌరస్తాలో నూతనంగా అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ చౌరస్తాలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని నేషనల్ హైవే పనులతో తొలగిస్తుండటంతో దాదాపు రూ. 6.50 లక్షల వ్యయంతో ప్రభుత్వం కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సంకల్పించింది. ఈ మేరకు అంబేడ్కర్ విగ్రహం చుట్టు పార్క్ సుందరీకరణ పనులు చేయనున్నారు. దీంతో ఈ కూడలికి కొత్త సొబగులు రానున్నాయి.

ఇకనైనా ఆ గ్రామాలకు నీరందేనా?

● వీరన్నపేట, చుంచనకోట గ్రామాలకు భగీరథ నీరందక ఇక్కట్లు
● ఇన్నాళ్లుగా తపాస్‌పల్లి జీఎల్‌బీఆర్ నుంచి నీటి సరఫరా
● ముస్త్యాల శివారులోని సలాఖ్‌పూర్ ఓహెచ్‌బీఆర్ నుంచి పైప్‌లైన్ ఏర్పాటుకు పనులు ముమ్మరం



చేర్యాల మండలం ముస్త్యాల శివారులో సలాఖ్‌పూర్ ఓహెచ్‌బీఆర్, పనులు చేపట్టేందుకు డంప్‌చేసిన పైపులు

చేర్యాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం వీరన్నపేట, చుంచనకోట గ్రామాలకు ఇక నుంచి మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందనున్నాయి. ప్రస్తుత వేసవి కాలం నుంచి ఇక్కట్లు తలెత్తకుండా శాశ్వత ప్రాతిపదికన నీటి ఎద్దడి తీరనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా గ్రామాల ప్రజల కోరిక మేరకు ముస్త్యాల శివారులోని సలాఖ్‌పూర్ ఓహెచ్‌బీఆర్ నుంచి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టి అనుసంధానం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

తపాస్‌పల్లి నుంచి నీరందక ఇక్కట్లు

మిషన్ భగీరథపథకంలో భాగంగా ఐదు నియోజకవర్గాలకు తాగునీటిని అందించేందుకు కొమురవెల్లి గ్రామశివారులోని రాజీవ్ రహదారికి చేరువలో 1800కిలోలీటర్ల సామర్థ్యంతో ఓహెచ్‌బీఆర్ నిర్మించారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాల్లోని హ్యాబిటేషన్లకు మళ్లించేందుకు తపాస్‌పల్లి, మర్రిముస్త్యాల గ్రామాల్లో జీఎల్‌బీఆర్‌లు, ముస్త్యాల శివారులో 120కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన ఓహెచ్‌బీఆర్‌లను నిర్మించారు. చేర్యాల, బచ్చన్నపేట మండలాల సరిహద్దులోఉన్న వీరన్నపేట, చుంచనకోట గ్రామాలకు తపాస్‌పల్లి జీఎల్‌బీఆర్ ద్వారా పైప్‌లైన్ నిర్మించారు. కానీ ఇతర గ్రామాలగుండా ప్రవహించి చేరుకునేసరికి నీరు సరిపోక ప్రజలు నానాతంటాలు పడుతున్నారు.

ముస్త్యాల శివారులో నిర్మాణం

మద్దూరు మండలంలోని 50 హ్యాబిటేషన్లకు నీటిని మళ్లించేందుకు ముస్త్యాల శివారులోని ఓహెచ్‌బీఆర్ నిర్మాణం చేపట్టారు. కొమురవెల్లి ఓహెచ్‌బీఆర్ నుంచి ముస్త్యాల వరకు 20కిలోమీటర్ల మేర ప్రధాన పైప్‌లైన్ ఉంది. కాగా ముస్త్యాల శివారులోని ఓహెచ్‌బీఆర్ నుంచి చుంచనకోట, వీరన్నపేట గ్రామాలు అతి చేరువన ఉండటంతో ఇక్కడినుంచే నీటిని అందించాలని చాన్నాళ్లుగా ఆయా గ్రామాల ప్రజల కోరుతున్నారు. కానీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల వీరన్నపేట గ్రామసందర్శనకు వచ్చిన సమయంలో గ్రామస్థులు నీటి ఎద్దడి సమస్యను విన్నవించారు. ముస్త్యాల ఓహెచ్‌బీఆర్ నుంచి పైప్‌లైన్ ద్వారా అందిస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలపడంతో ఆయన మిషన్‌భగీరథ అధికారులతో మాట్లాడారు.

2 కిలోమీటర్ల పైప్ లైన్‌తో సమస్య కొలిక్కి

కొద్దిరోజుల క్రితం మిషన్ భగీరథ అధికారులు సర్వే చేపట్టడంతో. సుమారు రెండుకిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి ప్రత్యామ్నాయచర్యలు చేపట్టారు. పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తుండటంతో పైపులను డంప్ చేశారు. ట్యాంక్ సమీపం నుంచి దేవాదుల కెనాల్‌దారి ఉండటంతో రెండువారాల్లో పైప్‌లైన్ పనులు పూర్తిచేయనున్నారు. దీంతో సుమారు 25-30కిలోమీటర్లకు బదులు కేవలం 3కిలో మీటర్ల దూరం నుంచి నిత్యం 800కేఎల్ నీరు సరఫరా చేయనున్నట్లు అధికారులు తెలిపారు. త్వరితగతిన పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. కాగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో సమస్య పరిష్కారమైందని బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వెలిబుచ్చుతుండగా, కాంగ్రెస్ నేతలు జనగామ డీసీసీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కృషితోనే సాకారమైందని పేర్కొంటూ సోషల్‌మీడియాలో పోటాపోటీగా పోస్టులు వైరల్ కావడం చర్చనీయాంశమైంది.

కారు, బైక్ ఢీ.. యువకుడి మృతి


మృతి చెందిన రజినీకాంత్‌రెడ్డి

సిద్దిపేట రూరల్, మార్చి 29(ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు శివారులో సిద్దిపేట-ముస్తాబాద్ రోడ్డులో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మొకిల్ల రజినికాంత్‌రెడ్డి (24) సిద్దిపేట నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. అదేసమయంలో ముస్తాబాద్ నుంచి సిద్దిపేట వైపు వస్తున్న కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో రజినీకాంత్‌రెడ్డికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనాస్థలానికి సిద్దిపేట రూరల్ పోలీసులు చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

కొండపోచమ్మ కాల్వను తొలగించిన వారిపై కేసు

ములుగు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ కాలువ తొలగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 27న అర్ధరాత్రి నర్సంపల్లి గ్రామంలో కొండపోచమ్మసాగర్ నుంచి వచ్చే కాలువ నుంచి నీటిని విడుదల చేయకపోవడంతో గ్రామ రైతులు ఎక్స్‌కవేటర్‌తో కాలువలు తొలగించారు. ఇది గమనించి పరిసర ప్రాంతాల రైతులు దాన్ని పూడ్చారు. ఈ సమాచారమందుకున్న ఇరిగేషన్ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి ఏఈ రాజశేఖర్‌కు నివేదిక అందించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు సీహెచ్ విజయ్‌కుమార్ తెలిపారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు

చేర్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాయపల్లి చెరువు నుంచి శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తుండటాన్ని స్థానికులు అడ్డుకున్నారు. దొమ్మాట గ్రామానికి చెందిన పలువురు మూడు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండటాన్ని గమనించి అడ్డుకోవడంతో ఇసుకను తరలిస్తున్నవారు దాడికి దిగారు. దీంతో 100నంబర్‌కు డయల్ చేయడంతో మద్దూరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కాగా చేర్యాల మండలం ఆకునూరు గ్రామం నుంచి పలువురు రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇసుక తరలింపు నిషేధించినా పలువురు అడ్డదారిన ఇసుకను విక్రయిస్తుండటంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుకను తరలిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లాలో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టాలి


జిల్లా సమీకృతకార్యాలయ సముదాయంలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ పుష్పన్ కుమార్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డ్రగ్స్ వినియోగాన్ని అంతం చేయాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ సరఫరాపై నిఘా పెట్టి, వినియోగాన్ని అంతం చేయాలని, సోషల్ మీడియాలో, విద్యాసంస్థల్లో డ్రగ్స్ అవేర్నెస్‌పై ప్రచారం చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. అనంతరం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో వారు జారీ చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సుభాష్ చంద్రబోస్, ఆర్అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్, ట్రాఫిక్ ఏసీపీ సుమన్ కుమార్, డీడబ్ల్యూ లక్ష్మీకాంత్ రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ శాంతి, ఆర్టీసీ, అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో యాంటీడ్రగ్ కమిటీ

సిద్దిపేట కల్చరల్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మాదకద్రవ్యాల నివారణపై పోస్టర్‌ను ఆవిష్కరించారు. శనివారం యాంటీ డ్రగ్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ కుమార్, సీఐ రామానాయక్ చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్‌గా వి. బాలకిషన్, సభ్యులుగా జి. బాలకిషన్, బి కృష్ణయ్యను నియమించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.పి అయోధ్య రెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

గజ్వేల్ రూరల్: గంజాయి, ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దని నార్కోటిక్ డ్రగ్ ఏసీపీ పుష్ప కుమార్ సూచించారు. శనివారం గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ గ్రామంలోని సెయింట్‌మేరిస్ విద్యానికేతన్ హై స్కూల్‌లో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, గంజాయి, మత్తు పదార్థాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం


చేర్యాలలో పార్టీ జెండా ఎగరేస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి రాజు

చేర్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ 43వ ఆవిర్భావ వేడుకలను శనివారం చేర్యాలలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒగ్గు రాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బడుగు, బలహీన, పేద వర్గాల అభ్యున్నతికి పాటుపడింది టీడీపీయేనన్నారు. తెలంగాణ ప్రజలకు ప్రత్యామ్నాయం టీడీపీయేనని, రాష్ట్రంలో పార్టీ పూర్వవైభవం తప్పక సంతరించుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మిట్టపల్లి నారాయియణరెడ్డి, పాము శివలింగం, మధు, భిక్షపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే నాణ్యమైన సేవలు

● ఆర్టీసీ మెదక్ రీజియన్ మేనేజర్ ఎస్తర్ ప్రభులత

గజ్వేల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్ల సమష్టి కృషితోనే ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందుతాయని టీజీఎస్‌ఆర్టీసీ మెదక్ రీజియన్ మేనేజర్ ఎస్తర్ ప్రభులత పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్‌డిపోను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎర్నింగ్స్, మెకానికల్, ఆఫీస్ విభాగాల్లో సమీక్ష నిర్వహించారు. డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆదర్శ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిపోలో మజ్జిగ వితరణ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హోటళ్లకు స్టీల్ గ్లాసులు

హుస్నాబాద్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్న ప్లాస్టిక్‌ను నివారించేందుకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వినూత్న కార్యక్రమం చేపట్టారు. తన తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో హోటళ్లలో ప్లాస్టిక్ గ్లాసులు వినియోగించకుండా స్టీల్ గ్లాసులు అందిస్తున్నారు. మొదటగా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్ పట్టణం, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లోని 135 హోటళ్లకు ఒక్కో దానికి 100 గ్లాసుల చొప్పున పంపిణీ చేయనున్నారు. జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి ఆధ్వర్యంలో వీటిని ఉగాది సందర్భంగా పంపిణీ చేయనున్నారు.

ఆన్‌లైన్ గేమ్స్ జోలికి వెళ్లొద్దు


మాట్లాడుతున్న ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్

చిన్నకోడూరు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. చిన్నకోడూరు మండలం పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో శనివారం జిల్లాలోని హోంగార్డు సిబ్బందితో ఇంట్రాక్టివ్ సెషన్ నిర్వహించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో విధులు నిర్వహించే వారిని గుర్తించి రివార్డులు, అవార్డులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ బాలకృష్ణ, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సత్య భూపాల్, హోంగార్డ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ఏఆర్ కానిస్టేబుల్ ప్రవీణ్, హోంగార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీరందించని ప్రభుత్వం గద్దె దిగాలి

● ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి

ములుగు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంటకు నీరు అందించని ప్రభుత్వం వెంటనే గద్దె దిగిపోవాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి విమర్శించారు. శనివారం ములుగులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొండపోచమ్మసాగర్ నుంచి కాలువల సహకారం ఉన్న కాలువలకు నీరు అందించకపోవడంతోనే నర్సంపల్లి రైతులు ఆందోళన చేశారని, అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో కాలువను తొలగించారని వివరించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు కక్షగట్టి రైతులపై కేసులు పెట్టడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, మమత శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భగవాన్ లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పౌరహక్కులపై అవగాహన


నారాయణరావుపేటలో పౌరహక్కుల దినోత్సవంలో గ్రామస్థులతో అధికారులు

సిద్దిపేట రూరల్/కొండపాక/జగదేవ్‌పూర్ ,మార్చి 29(ఆంధ్రజ్యోతి); జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అధికారులు పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగించవద్దని సూచించారు. పౌరహక్కులకు భంగం కలిగించేవారిపై కఠిన చర్యలు తప్పవని వివరించారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన సివిల్‌రైట్స్ డే కార్యక్రమంలో ఆర్ఐ అర్జున్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితనం నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్, హెడ్ కానిస్టేబుల్ మురళి, జూనియర్ అసిస్టెంట్ సాయి, గ్రామస్థులు పాల్గొన్నారు. కొండపాక మండలం మర్పడగలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఐబాలకృష్ణ మాట్లాడుతూ.. గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు అంజనేయులు, బాలరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ బాల్ నరసయ్య, త్రీ టౌన్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో తహసీల్దార్ రఘువీరారెడ్డి, ఏఎస్ఐ రమణారెడ్డిలు పౌరహక్కులపై అవగాహన కల్పించారు.

ప్రైవేట్ ఆస్పత్రి వద్ద ఆందోళన

గజ్వేల్ రూరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వద్ద మూడు నెలల పసికందు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే పాప మృతి చెందిందని ఆరోపిస్తూ ఆస్పత్రి వద్ద బైఠాయించారు. ఆస్పత్రి అద్దాలను ధ్వంసం చేశారు. అయితే, తమ తప్పేమీ లేదని వైద్యులు చెబుతున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం పాదయాత్ర


సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం పట్ల బీజేపీ అవలంబిస్తున్న తీరును నిరసిస్తూ సిద్దిపేట నియోజకవర్గంలో ఏప్రిల్ 2 నుంచి 14వరకు రాజ్యాంగ పరిరక్షణకోసం పాదయాత్రను నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ స్పష్టం చేశారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరిట కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సిద్దిపేట నియోజకవర్గంలో పాదయాత్రను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ రాజ్యాంగ వ్యతిరేక వైఖరిని ప్రజలకు వివరిస్తామన్నారు. పాదయాత్రకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సిద్దిపేటలో పాదయాత్ర ముగింపు రోజున నిర్వహించే భారీ బహిరంగ సభకు మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో నాయకులు కలీమొద్దీన్, బొమ్మల యాదగిరి, దేవులపల్లి యాదగిరి, దాస అంజయ్య, సాకి ఆనంద్, ఎల్లం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ రికార్డు సాధించిన అశ్వినికి సన్మానం

మర్కుక్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దామరకుంటకు చెందిన 9వ తరగతి విద్యార్థిని అశ్విని చెన్నైలో జరిగిన ఓ కార్యక్రమంలో 125 మూలాలు వాటి సంకేతాలను 58 సెకండ్స్‌లో పూర్తి చేసి ప్రపంచ రికార్డు సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్యతో పాటు విద్యార్థిని అశ్వినిని మండల విద్యాధికారి వెంకట్‌రాములు మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.

ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు


గజ్వేల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థులు

దుబ్బాక/మిరుదొడ్డి/గజ్వేల్/గజ్వేల్ రూరల్, చిన్నకోడూరు/చేర్యాల మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు నూతన సంవత్సర విశిష్టతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పచ్చడిని అందజేశారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్ హాజరై, విద్యార్థులకు, అధ్యాపకులు విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, చిన్నకోడూరు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, చేర్యాల మండలం కొత్తదొమ్మాట ఎంపీయూపీఎస్, భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో ముంద స్తు పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని మట్టి కుండలో తయారు చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. పలు చోట్ల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


గజ్వేల్ రూరల్: కొడకండ్ల పాఠశాలలో ఉగాది వేడుకల్లో విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు

జిల్లావాసులకు జాతీయ ప్రతిభా అవార్డులు


హైదరాబాద్‌లో అవార్డును అందుకుంటున్న వైకుంఠం

సిద్దిపేట కల్చరల్/చేర్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జాతీయ ప్రతిభా పురస్కారాలు, గ్లోబల్ ఐకాన్ అవార్డ్సు, బంగారు నంది అవార్డుల్లో భాగంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగ అధ్యాపకుడు జి. వైకుంఠం గ్లోబల్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. బెస్ట్ సింగర్ విభాగంలో ఈ అవార్డు దక్కింది. అదేవిధంగా కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, సాంస్కృతిక సారథి పిస్నింటి రత్నం జాతీయ ప్రతిభా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ మ్యూజియం, భాస్కర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీమంత్రి బాబుమోహన్, ఫౌండేషన్ డైరెక్టర్ శిరీష రెడ్డి రుద్ర ఫౌండేషన్ ఎం.డి. రుద్ర శ్రీనివాస్, జెమిని సురేష్, బిగ్‌బాస్ ఫేమ్ శేఖర్ భాష, నటుడు సూర్య నటి షీలాసింగ్ ఈ అవార్డులను అందజేశారు.

నాగరాజుశర్మకు ఉద్యోగవిరమణ సన్మానం

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): డీపీఆర్‌వో కార్యాలయంలో ఏవీఎస్(ఆడియో విజువల్ సూపర్‌వైజర్)గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న నాగరాజు శర్మ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం కలెక్టరేట్‌లోని డీపీఆర్‌వో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజుశర్మను డీపీఆర్‌వో, సమాచార ఇంజనీరింగ్ కార్యాలయ అధికారులు సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సమాచార శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ భూపాల్ రెడ్డి, రిటైర్డ్ డీపీఆర్‌వో శాంతికుమార్, సమాచారశాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి నాయక్, రిటైర్డ్ ఏవీఎస్ కిషోర్ బాబు, నిజామాబాద్ ఏవీఎస్ ప్రసాద్, జర్నలిస్టులు ప్రశాంత్, గిరి, వెంకటేష్, కార్యాలయ సిబ్బంది రాములు, మల్లికార్జున్, నీరజ, రేణుక, స్వామి చరణ్, సైదులు, మహేష్, బాహోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వల్లే మైనార్టీల అభివృద్ధి

● పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్

సిద్దిపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ముస్లింల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు ఎక్కడా కక్షపూరిత రాజకీయాలు చేయడం లేదన్నారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో ముస్లింలను అణచివేశారని, ముస్లిం అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. పవిత్ర రంజాన్ నెలలో ఇఫ్తార్ విందుపై అవమానించేలా వ్యవహరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను ఆ అల్లాహ్ కూడా క్షమించడని మండిపడ్డారు. ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు అనవసర విమర్శలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వహాబ్, గాయాజుద్దీన్, అజ్మత్, రాశాద్, చోట అజ్మత్, అలీ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట ఫౌండేషన్ సేవలు అభినందనీయం

సిద్దిపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు అన్నారు. శనివారం సిద్దిపేట పట్టణంలోని మిలాన్ గార్డెన్‌లో సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలకు నిత్యావసర సరుకుల కిట్లను సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారాజనర్సు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఇరవై ఏళ్లుగా పేద ముస్లింలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ సద్ది నాగరాజురెడ్డి, కో అప్షన్ సభ్యులు సయ్యద్, సుడా మాజీ డైరెక్టర్ మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇఫ్తార్‌లో ఉర్దూకు స్థానమెక్కడ?

సిద్దిపేట టౌన్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): పూర్తి సెక్యూలర్ పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎక్కడా ఉర్దూ భాష కనిపించలేదని బీఆర్‌ఎస్ మైనారిటీ నాయకుడు అబ్దుల్ మొయిజ్ మండిపడ్డారు. శనివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఉర్దూ భాషను చిన్నచూపు చూడటం సమంజసం కాదన్నారు. ఇఫ్తార్ పార్టీ అనేది ప్రభుత్వం పరంగా కాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం లాగా నిర్వహించారని విమర్శించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో వీడ్కోలు సంబురాలు


విద్యార్థినిల సాంస్కృతిక కార్యక్రమాలు

సిద్దిపేట కల్చరల్, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశం సందడిగా సాగింది.ఈ సందర్భంగా పలు సందేశాత్మక లఘు నాటికలు, సంప్రదాయ జానపద నృత్యాలు, సినిమా పాటలతో వేదికను ఉర్రూతలూగించారు. సంప్రదాయ, అధునాతన వస్త్రాలంకరణలతో విద్యార్థినులు ముస్తాబయ్యారు.